# ముఖ్యమంత్రి కార్యాలయము

# తెలంగాణ ప్రభుత్వం

**పత్రికా ప్రకటన** **తేది: 30-04-2016**

కరువు, వడగాల్పులు, ఎండ వేడిమి, భూగర్భ జలాలు తగ్గిపోవడంలాంటి పరిణామాల నేపథ్యంలో ఏర్పడిన పరిస్థితులను ఎదుర్కోవడానికి, ప్రజలకు కావాల్సిన సహాయక చర్యలు తీసుకోవడానికి అధికారులు ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాలని ముఖ్యమంత్రి శ్రీ కె. చంద్రశేఖర్ రావు కోరారు. ఎండ వేడి ఎక్కువగా వున్నందువల్ల ఉపాధి హామీ పనులను మధ్యాహ్నం చేయించవద్దని, ఉదయం, సాయంత్రం సమయాల్లోనే పనులు చేయాలని చెప్పారు. పట్టణాలు, గ్రామాల్లో వడదెబ్బ మందులు అందుబాటులో వుంచాలని సూచించారు. ఏ ప్రాంతంలోనైనా ప్రజలు తిండిలేక బాధపడితే వెంటనే స్పందించాలని, ప్రభుత్వం అక్కడ యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకుంటుందని స్పష్టం చేశారు. పశుగ్రాసం ఎక్కడెంత అవసరముందో అంచనా వేసి, అందచేయాలని కోరారు. ఈ సారి మంచి వర్షాలు కురుస్తాయనే అంచనాలున్నందున ఖరీఫ్ కోసం ఇప్పటి నుంచే సిద్ధం కావాలని చెప్పారు. పత్తికి రానున్న రోజులలో పెద్దగా మార్కెట్ వుండదని, రైతులను ప్రత్యామ్నాయ పంటలకు సిద్ధం చేయాలని కోరారు. నైరోబిలో జరిగిన WTO సమావేశంలో పత్తి ఎగుమతులపై ఉన్న పన్ను రాయితీని ఉపసంహరించే తీర్మానంపై భారత్ సంతకం చేసిన విషయాన్ని సిఎం గుర్తు చేశారు. సోయాబీన్ తదితర పంటల సాగుకు రైతులను ప్రోత్సహించాలని, విస్తృత ప్రచారం కల్పించాలని చెప్పారు.

ఎమ్.సి.ఆర్.హెచ్.ఆర్.డి.లో శుక్రవారం కలెక్టర్ల సమావేశం జరిగింది. ఉప ముఖ్యమంత్రి మహమూద్ అలీ, మంత్రులు పోచారం శ్రీనివాసరెడ్డి, జోగు రామన్న, తలసాని శ్రీనివాస్ యాదవ్, మిషన్ భగీరథ వైస్ చైర్మన్ వేముల ప్రశాంత్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రాజీవ్ శర్మ, సీనియర్ అధికారులు ఎస్.పి.సింగ్, ఎస్.కె.జోషి, బి.ఆర్.మీనా, సురేష్ చంద్ర, తివారి, శరత్, రామకృష్ణ రావు, నవీన్ మిట్టల్, వికాస్ రాజ్, షఫీవుల్లా, నర్సింగ్

రావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్లు ఆయా జిల్లాల్లోని కరువు, వడదెబ్బలు, ఎండ వేడి తదితర పరిణామాలను వివరించారు.

"వడదెబ్బల వల్ల మరణించిన వారెవరైనా సరే ఆపద్బంధు పథకం ద్వారా సహాయం అందించాలి. 65 సంవత్సరాల లోపు వారికే వర్తింప చేయాలనే నిబంధన తొలగించాలి. రాష్ట్ర వ్యాప్తంగా ఎండలు తీవ్రంగా వున్నాయి. కాబట్టి మంచినీటితో పాటు ఇతర సమస్యలున్నాయి. మరో నెల, నెలన్నర వరకు ఇదే పరిస్థితి వుంటుంది. అప్పటిదాకా పరిస్థితిని ఎదుర్కోవడానికి అవసరమైన కార్యాచరణ రూపొందించుకుని ముందుకు పోవాలి. ప్రజలకు ORS ప్యాకెట్లు అందుబాటులో వుంచాలి. చలివేంద్రాలు ఏర్పాటు చేయాలి. మంచినీరు అందని ప్రాంతాలకు ట్యాంకర్ల ద్వారా రవాణా చేయాలి. ఉపాధి హామీ పనులను ఉదయం పదిన్నరలోపు, సాయంత్రం నాలుగున్నర తర్వాతే చేయించాలి. కరువు, ఎండవేడి తదితర కారణాల వల్ల మంచినీటి సమస్య, భూగర్భ జలాలు అడుగంటిపోవడం లాంటి సమస్యలు వచ్చాయి. వాతావరణ సమతల్యం దెబ్బతినడం వల్ల తరచూ ఇలాంటి పరిస్థితి వస్తుంది. ఇలాంటి పరిస్థితులే మిషన్ కాకతీయ, మిషన్ భగీరథ పథకాల ప్రాధాన్యత, ఆవశ్యకతను తెలియచేస్తాయి. మిషన్ భగీరథ పూర్తయితే ఇక మంచినీటికి కొదవుండదు. మిషన్ కాకతీయ పూర్తయితే చెరువులు నిండి భూగర్భ జలాలమట్టం పెరుగుతుంది. సిద్ధిపేటలో మంచినీటి పథకం అమలవుతున్నందున అక్కడ కరువు ప్రభావం లేదు. రాష్ట్రమంతా ఇదే పరిస్థితి రావాలి" అని ముఖ్యమంత్రి అన్నారు.

మిషన్ భగీరథ

------------------

‘‘ఖరీఫ్ సీజన్ ప్రారంభం కాకముందే వ్యవసాయ భూముల్లోంచి పోయే పైపులైన్ల నిర్మాణం పూర్తి చేయాలి. వర్షాలు వస్తే పనులు చేపట్టడం సాధ్యపడదు’’ అని సిఎం చెప్పారు. జిల్లాల వారీగా ఇన్ టేక్ వెల్స్, వాటర్ ట్రీట్ మెంట్ ప్లాంట్స్, పంప్ హౌజ్, పవర్ స్టేషన్స్, పైప్ లైన్స్ నిర్మాణాల పురోగతిని కలెక్టర్లు, ఆర్.డబ్ల్యు.ఎస్. అధికారులతో సిఎం సమీక్షించారు. నిర్మాణాలకు కావాల్సిన ఇసుకను వర్షాలు రాకముందే తెప్పించుకుని

పెట్టుకోవాలని కేసీఆర్ సూచించారు. పైపులైన్ల నిర్మాణానికి అవసరమయ్యే అటవీ అనుమతుల్లో జాప్యం ఉండరాదని సిఎం ఆదేశించారు.

మిషన్ కాకతీయ

-------------------

మొదటి విడతలో చేపట్టిన చెరువుల పునరుద్ధరణ కార్యక్రమం త్వరలో ముగించి, రెండో విడత కార్యక్రమం శరవేగంతో నిర్వహించాలని సిఎం చెప్పారు. పరిపాలనా అనుమతులు, సాంకేతిక అనుమతులు, ఆర్థిక శాఖ అనుమతులు తదితర అంశాలు పనుల వేగాన్ని ప్రభావితం చేయకుండా సరళమైన పద్ధతులు అవలంబించాలని సిఎం చెప్పారు. ప్రతీ చెరువు పనికీ ఆర్థిక శాఖ అనుమతి అవసరం లేదని, దీనికి సంబంధించి మార్గదర్శకాల్లో మార్పులు చేయాలని సూచించారు. మిషన్ కాకతీయ రెండో దశలో 9 వేలకు పైగా చెరువుల మరమ్మతు పనులు చేపట్టనున్నందున చాలా వేగంగా పనులు చేయాలని సూచించారు.

మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ, నీటి ప్రాజెక్టులు, రహదారులు తదితర పనులన్నీ ఒకే సారి జరుగుతున్నందున కలెక్టర్లు అన్ని కార్యక్రమాలను సమీక్షించాలని, సమన్వయం చేయాలని సిఎం చెప్పారు. కాంట్రాక్టర్లు, మిషనరీ, అధికార యంత్రాంగం అందరినీ సమన్వయం చేయాలన్నారు. జిల్లాల వారీగా పరిస్థితిని అంచనా వేసి, యాంత్రిక, మానవ వనరులను సిద్ధం చేసుకోవాలని చెప్పారు. పనులు వేగంగా జరగడానికి అవసరమయ్యే విధాన మార్పులు ప్రభుత్వం తీసుకుందన్నారు. మిషన్ కాకతీయ పనులు మరింత వేగంగా జరిగేందుకు అవసరమయ్యే చర్యలు తీసుకోవాలని సూచించారు. కరువు పరిస్థితులవల్ల చెరువుల్లో నీరు లేదని, ఈ పరిస్థితిని సదవకాశంగా తీసుకుని పనులు చేయాలన్నారు.

చాలా శాఖల్లో ఒకేసారి పెద్దమొత్తంలో నిర్మాణ పనులు జరుగుతన్నందున మిషనరీ, సిబ్బంది కొరత ఏర్పడుతున్నందున, ఈ సమస్యను అధిగమించడానికి అవసరమైన ప్రణాళిక రూపొందించాలని ముఖ్యమంత్రి శ్రీ కె. చంద్రశేఖర్ రావు అన్నారు. నిర్ణీత కాల వ్యవధి కోసం సిబ్బందిని నియమించుకోవాలని, ఏ అధికారి

ఎంత పని చేయగలడో శాస్త్రీయంగా అంచనా వేసి పని విభజన చేయాలని చెప్పారు. పనుల్లో నాణ్యత పాటించడం కూడా ముఖ్యమని సిఎం అన్నారు.

ఈ ఏడాది 106 శాతం వానలు

-----------------------------------

ప్రస్తుత వేసవితో పాటు, వచ్చే వానకాలం ఎలా వుంటుందనే అంశంపై కూడా చర్చ జరిగింది. ఈ సారి ఖరీఫ్ లో 106 శాతం వర్షాలు పడే అవకాశం వుందని వాతావరణ శాఖ డైరెక్టర్ వైకె రెడ్డి తెలిపారు. ఎప్పటికప్పుడు వాతావరణ పరిస్థితులను తెలుసుకుంటూ ప్రజలను అప్రమత్తం చేయాలని సిఎం సూచించారు. మే 15న మరోసారి వాతావరణ శాఖ అధ్యయన నివేదిక వెలువడుతుంది కాబట్టి, మరింత స్పష్టత వస్తుందని సిఎం అన్నారు.

వ్యవసాయం

---------------

పత్తి వేసి నష్టపోయే బదులు రైతులు ప్రత్యామ్నాయ పంటలు వేయాలని సీఎం అన్నారు. 42 లక్షల ఎకరాల్లో ప్రస్తుతం పత్తిపంట వేస్తున్నారని, ఆ సాగును 15-20 లక్షల ఎకరాలకు తగ్గించాలని సిఎం సూచించారు. పత్తికి ప్రత్యామ్నాయంగా సోయాబీన్, మొక్కజొన్న పంటలను సాగు చేస్తే ప్రయోజనం కలుగుతుందని సిఎం అన్నారు. సోయాబీన్, మొక్కజొన్న విత్తనాలను వ్యవసాయ శాఖ సరఫరా చేయాలని చెప్పారు. రైతులకు ఈ విషయంలో అవగాహన పెంచాలని, ఈ సారి వర్షపాతం కూడా బాగానే వుంటుంది కాబట్టి అందుకనుగుణంగా ప్రణాళిక తయారు చేయాలని సూచించారు. పత్తిసాగును నిరుత్సాహ పరిచే విధంగా తాము ప్రణాళిక రూపొందించినట్లు వ్యవసాయ శాఖ కార్యదర్శి పార్థసారథి చెప్పారు.

వ్యవసాయ శాఖను బలోపేతం చేస్తామని, ప్రతీ ఐదువేల ఎకరాలకు ఒక అధికారి వుండే విధంగా సిబ్బంది నియామకం చేపడుతున్నామన్నారు. వ్యవసాయాధికారులకు పదోన్నతి ఇవ్వాలని, అగ్రికల్చర్ ఆఫీసర్లను ఆగ్రానమిస్టులుగా తీర్చిదిద్దాలన్నారు. ప్రాజెక్టులు పూర్తయి సాగునీరు వస్తే తెలంగాణలో అద్భుత వ్యవసాయం సాగుతుందని వ్యవసాయ శాఖ బాధ్యతలు పెరుగుతాయని చెప్పారు. సోయాబీన్ విత్తనాలు, ఇచ్చే

సందర్భంలో ఐదు ఎకరాలలోపు రైతులకే వర్తింపు చేయాలని, ఒకే పంట వేసే వారికిచ్చే సబ్సిడీలు రెండున్నర ఎకరాలకే ఇవ్వాలనే నిబంధనలు తీసేయాలని సిఎం చెప్పారు. తెలంగాణలోని రైతులందరికీ ఎలాంటి భేదం లేకుండా సోయాబీన్ పై సబ్సిడీ ఇవ్వాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. సోయాబీన్ విత్తనాలను, పరికరాలను రైతులకు సబ్సిడీపై అందించాలని సిఎం చెప్పారు. వచ్చే ఖరీఫ్ కు అవసరమైన విత్తనాలను ముందుగానే తెచ్చుకుని నిల్వ చేశామని అధికారులు చెప్పారు. కొత్తగా నిర్మించే గోదాములను, ఇప్పటికే అందుబాటులో వున్న గోదాములను విత్తనాలు, ఎరువులను నిల్వ చేసుకోవడానికి ఉపయోగించాలన్నారు. రైతులకు అవసరమయ్యే నాలుగులక్షల టన్నుల ఎరువులను బఫర్ స్టాక్ గా పెట్టామని మార్కెటింగ్ ఎండి శరత్ చెప్పారు.

రైతుల రుణమాఫీ మూడో విడత నిధులు విడుదల చేయనున్నందున, రైతులకు సాఫీగా రుణమాఫీ జరిగేలా చూడాలని సిఎం చెప్పారు. రుణమాఫీ పొందే రైతుల బ్యాంకు ఖాతాలను మరోసారి క్షుణ్ణంగా పరిశీలించాలని, ఆడిటర్ల సహకారం తీసుకోవాలని సూచించారు. తక్కువ విత్తనంతో ఎక్కువ దిగుబడి వచ్చే సేలం పసుపు సాగు చేయాలని మంత్రి పోచారం శ్రీనివాసరెడ్డి చెప్పారు.

హరితహారం

---------------

గత ఏడాది వర్షాలు సరిగా లేనందున తెలంగాణకు హరితహారం కార్యక్రమంలో అనుకున్న స్థాయిలో మొక్కలు పెంచలేకపోయామని సిఎం అన్నారు. వచ్చే వానకాలంలో తెలంగాణ వ్యాప్తంగా హరితహారం కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. రాష్ట్రంలోని వివిధ నర్సరీలలో 46.30 కోట్ల మొక్కలు సిద్ధమవుతున్నాయన్నారు. ఉద్యమ స్ఫూర్తితో హరితహారం కార్యక్రమం చేపట్టాలని, సమాజంలోని అన్ని వర్గాలనూ భాగస్వామ్యం చేయాలన్నారు. జిల్లాల వారిగా కార్యాచరణ రూపొందించాలన్నారు. ఇండ్లల్లో పెంచడానికి అవసరమైన పండ్ల మొక్కలు సరఫరా చేయాలని, మొక్కలు నాటడానికి గుంతలు తీసే పనిని ఉపాధి హామీ పథకంతో అనుసంధానం చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఆర్ఓఎఫ్ఆర్ భూముల్లో యూకలిప్టస్ మొక్కలు పెంచాలని సూచించారు. నేషనల్ హైవేపై రోడ్లకిరువైపులా మొక్కలు నాటాలన్నారు.

రెసిడెన్షియల్ స్కూళ్లు

--------------------------

2016-17 విద్యా సంవత్సరం నుంచి మైనారిటీలు, ఎస్సీలు, ఎస్టీల కోసం 250 రెసిడెన్షియల్ స్కూళ్లు నడపాలని, ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను కలెక్టర్లు పర్యవేక్షించాలని ముఖ్యమంత్రి కోరారు. గురుకుల పాఠశాలల భవనాలు నిర్మించే వరకు కొంత సమయం పడుతుంది కాబట్టి, తరగతులు, హాస్టల్ నిర్వహణకు అద్దె భవనాలు సమకూర్చాలని సిఎం చెప్పారు. మైనారిటీ రెసిడెన్షియల్ స్కూల్స్ కోసం ఇప్పటికే స్థల సేకరణ జరుగుతున్నదని, ఎస్సీ, ఎస్టీ గురుకులాల కోసం కూడా స్థల సేకరణ జరగాలని చెప్పారు. సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల మాదిరిగానే కొత్త గురుకులాలు నడుపుతామన్నారు.

హరితమిత్ర అవార్డులు

---------------------------

మొక్కలు నాటి, పెంచే విషయంలో స్ఫూర్తిదాయక పాత్ర నిర్వహించిన వారికి హరితమిత్ర అవార్డులు ఇవ్వాలని సిఎం నిర్ణయించారు. ఇందుకోసం ప్రతిపాదనలు పంపాలని కోరారు.

**సిపిఆర్ఓ టు సిఎం**